

బుధవారం నుంచి మార్గశిర మాసం

# హేమంత సంతసం

**ప్రకృతిలో మార్పులకు సాక్షి. ఆధ్యాత్మిక సాధకులకు శ్రీరామరక్ష. మహనీయుల అవతరణకు వేదిక. కవులకు, కావ్యాలకు అక్షర మాలిక... వేదం చెప్పిన కాల స్వరూపం. పరమాత్మ ఉపదేశించిన గీతాసారం. ఇన్నిటినీ ఇముడ్చుకున్న రుతువు హేమంతం. శరత్కాలాన్ని సాగనంపి ఆగమిస్తున్న హేమంత లీలా విలాసం ఒకసారి స్మరించుకుందాం..**

**భారతీయ** ఆధ్యాత్మిక వ్యవస్థ అపరిమితం. ప్రకృతిలో జరిగే మార్పులను ఒడిసిపడుతుంది. అందులోని రహస్యాలు, అంతరార్థాలు మానవులకు తెలియజేస్తుంది. లౌకిక జీవనం పునాదిగా అలౌకిక జీవనానికి మార్గదర్శనం చేయడం మన ఆధ్యాత్మికత గొప్పదనం. కాలస్వరూపాన్ని అనుసరిస్తూ ఆగమిస్తున్న హేమంత రుతువు ఆధ్యాత్మిక కోణంలో అందమైనది మాత్రమే కాదు, అనంత సిద్ధులనూ ప్రసాదించే అద్భుత కాలం. వానజాడలు పూర్తిగా కనుమరుగై, అప్పటికే ప్రవేశించిన చలిని రెట్టింపు చేస్తూ ప్రకృతి కాంతకు చేమంతుల హారం వేస్తుంది హేమంతం.
శరదృతువు ముగిసి హేమంతం మొదలయ్యే సమయానికి వానలతో చికాకు కలిగించిన ప్రకృతి నెమ్మదిగా శీతలంగా మారుతుంది. వాతావరణంలో పగటి కాలపరిధి తగ్గుతూ, రాత్రి నిడివి పెరుగుతుంది. చలిగాలుల ప్రభావం అధికమవుతుంది. ఇతర రుతువులకు భిన్నంగా హేమంతం మనుషుల్ని దగ్గర చేస్తుంది. ఆహ్లాదాన్ని పెంచుతుంది. అంతేకాదు.. ఒక్కటిగా కలిసి నడిస్తే సమాజం ఎంత ఉన్నతంగా ఎదుగుతుందో వివరిస్తుంది. అందుకనే మార్గశిర, పుష్య మాసాలను (హేమంత రుతువు) ఆధ్యాత్మిక చింతనకు బీజం వేసే మాసాలని పెద్దలు చెబుతారు.

### బమ్మెర పోతరాజు భాగవతంలో..

ఈ హేమంతము రాకఁ జూచి
రమణీ హేలా పరీరంభ స
త్సాహాయ్యంబునఁ గాని
దీని గెలువన్ శక్యంబుగా దంచుఁ దా
రూహాపోహవిధిం త్రిమూర్తులు
సతీ యుక్తాంగులైనారు గా
కోహో! వార లదేమి
సంతతవధూయోగంబు రాఁ గందురే?

హేమంత రుతువు కారణంగా చలి తీవ్రత పెరిగింది. చలి శత్రువును జయించాలంటే తమ భార్యల తోడు తప్పనిసరి అని భర్తలు భావిస్తున్నారు. ఈ కారణంగానే త్రిమూర్తులు త్రిశక్తుల్ని విడిచిపెట్టడం లేదు. హేమంతం తోడు లేకపోతే ఇది సాధ్యమయ్యే పనేనా? అంటూ చమత్కరిస్తాడు.

### వేదం వివరించిన హేమంతం

వేదకాలంలో ఆయనాంశం (సంవత్సర ఆరంభం) మార్గశిర మాసంతోనే మొదలయ్యేది. ఈ ప్రకారం సంవత్సరం హేమంతంతోనే మొదలయ్యేది. ఆ కాలంలో మార్గశిర మాసాన్ని 'అగ్రహాయణిక' అనే పేరుతో వ్యవహరించేవారు. తైత్తిరీయ బ్రాహ్మణంలో సంవత్సరాన్ని పక్షితో, రుతువులను పక్షి అవయవాలతో పోల్చుతూ వర్ణించారు.

తస్య తే వసంతః శిరః; గ్రీష్మో దక్షిణః పక్షః।
వర్షాః పుచ్ఛం; శరద్ ఉత్తరః పక్షః; హేమంతో మధ్యం॥
(తై. బ్రా. 3.10.4.1)

సంవత్సరమనే పక్షికి వసంతం శిరస్సు అయితే, గ్రీష్మం కుడి రెక్క, వర్ష రుతువు తోక, శరత్తు ఎడమ రెక్క కాగా.. హేమంతం మధ్యభాగం అని చెబుతుందీ మంత్రం.
తైత్తిరీయ సంహితలో ఆరు రుతువుల్ని (తైత్తిరీయ సంహితం, తైత్తిరీయ బ్రాహ్మణం తరువాతి కాలంలో వెలువడింది. ఇప్పుడు చెప్పుకొనే చైత్రం, వైశాఖం తదితర మాసాల పేర్లు అప్పటికింకా ప్రాచుర్యంలోకి రాలేవు) వివరించే మంత్రం మరొకటి ఉంది.

మధుశ్చ మాధవశ్చ వాసంతికావృతూ
శుక్రశ్చ శుచిశ్చ గ్రైష్మావృతూ
నభశ్చ నభస్యశ్చ వార్షికావృతూ
ఇషశ్చోర్జశ్చ శారదావృతూ
సహశ్చ సహస్యశ్చ హైమంతికావృతూ
తపశ్చ తపస్యశ్చ శైశిరావృతూ
(తైత్తిరీయ సంహిత 4-4-11)

ఈ మంత్రంలోని ప్రకారం సహం, సహసం అనే రెండు నెలలూ హేమంత రుతువులో భాగం.

### జ్యోతిషంలో..

జ్యోతిష శాస్త్రం హేమంత రుతువును ఆధ్యాత్మిక సాధనకు ఉత్తమ కాలంగా పేర్కొన్నది. చంద్రుడు మనః కారకుడు. చంద్రుడు అనుకూలంగా లేకపోతే మంచి ఆలోచనలు కలగవు. మానసిక స్థితి సరైన మార్గంలో ఉండదు. చంద్రుడు అనుకూలించే కాలమైన హేమంతంలో ఆధ్యాత్మిక సాధన ప్రారంభిస్తే శ్రద్ధ బాగా పెరిగి తద్వారా మనోధైర్యం వృద్ధి చెందుతుంది. జ్యోతిష శాస్త్రం ప్రకారం చంద్రుడికి ఉచ్చస్థానం వృషభ రాశి. మృగశిర నక్షత్రం వృషభరాశికి చెందుతుంది. కాబట్టి, చంద్రుడి సంపూర్ణ అనుగ్రహం ఉండి దైవకార్యాలు మరింతగా చేయాలనే మంచి ఆలోచనలు కలుగుతాయి.

### ఇతిహాసాల్లో..

ఆదికవి వాల్మీకి నుంచి ఆధునిక కవుల వరకూ అందరికీ హేమంతం అంటే మక్కువ ఎక్కువ. ప్రత్యేకించి ప్రబంధ కవులు హేమంతాన్ని విడిచిపెట్టిన సందర్భం లేదు. హేమంత వాతావరణం కవులను అంతగా కట్టిపడేసింది.
శ్రీరామచంద్రుడికి హేమంతం అంటే ఎంతో ఇష్టమట. వనవాసం చేస్తున్న సమయంలో శరత్కాలం ముగిసి హేమంతం ప్రారంభం కాబోతున్న సమయం అది. సీతతో కలసి వేకువజామున నదీస్నానానికి వెళ్లడానికి రామయ్య సిద్ధపడుతుంటాడు. లక్ష్మణుడు అన్నగారైన రామచంద్రుడిని సమీపించి 'అన్నా! నీకు ఎంతో ఇష్టమైన హేమంతం ప్రారంభం కాబోతున్నది' అంటాడు. ఇంకా... 'అన్నా! ఏ రుతువు వల్ల సంవత్సరం ప్రకాశిస్తుందో, నీకు ఇష్టమైన మాసమేదో, అలాంటి మార్గశిరం, హేమంత రుతువు అయిన మంచుకాలం ఇప్పుడు వచ్చింది కదా! ప్రజలకు దేహం కఠినమైంది. స్నానం చేయడానికి సాధ్యపడకుండా నీటికి పళ్లు వచ్చి కరవసాగింది. పైరుపచ్చలు కాంతితో కళకళలాడుతున్నాయి. అగ్నిహోత్రుడు గతంలో లాగా కాకుండా ఆప్తుడై ప్రజలను దగ్గరకు రానిస్తున్నాడు. తమకేది మంచిదో తెలుసుకొని కొత్త ధాన్యం రాగానే పాలలో పొంగించి దాన్ని పితృదేవతలకు నివేదించి పాపరహితులు అవుతున్నారు. అన్నా! రాజులు యుద్ధానికి పోవడానికి, గ్రామాలలో ఉండేవారు పాలు, పెరుగు తినడానికి, ఈ మంచుకాలం పనికొస్తుంది కదా? ఆహ్లాదం కలిగించేవాడు కాబట్టి చంద్రుడికి ఆ పేరొచ్చింది. ఇప్పుడా పేరును తనకు వ్యర్థం చేసుకొని, లోకులను సంతోషపర్చడానికి ఆ శక్తిని సూర్యుడికి ఇచ్చాడు. ఆ కారణంతో తపనుడు అనే పేరు సూర్యుడికి వచ్చి చంద్రుడిలాగా అయ్యాడు. (అంటే సూర్యుడు చంద్రుడిలాగా ప్రజలకు సంతోషం కలిగించేవాడయ్యాడు. చంద్రుడేమో మంచు కురవడం వల్ల ప్రజలకు బాధ కలిగించేవాడయ్యాడు)' అంటూ హేమంత వైభవాన్ని వర్ణించాడు వాల్మీకి.

### నేనే మార్గశిరం

మాసాల్లో మార్గశిరం తానేనంటూ శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో స్పష్టంగా చెబుతాడు. మార్గశిరంలోనే ధనుర్మాసం మొదలవుతుంది. సర్వ ఏకాదశి, గోవత్స ద్వాదశి, ముక్కోటి ఏకాదశి, మాస శివరాత్రి, సుబ్రహ్మణ్య షష్ఠి, కాలభైరవాష్టమి, గీతాజయంతి, దత్తాత్రేయ జయంతి, రమణమహర్షి జయంతి, హనుమద్ వ్రతం, ఆరుద్ర దర్శన మహోత్సవం.. ఇలా అనేక విశేష పర్వదినాలు మార్గశిర మాసంలోనే వస్తాయి. అన్నిటికీ మించి శ్రీకృష్ణపరమాత్మ తానే అని చెప్పిన మాసమిది. అందువల్లే మార్గశిరం విశిష్టమైంది. మహా దివ్యమైంది. 'మార్గం' అంటే దారి, బాట, అన్వేషణ అని అర్థం. 'శీర్షం' అంటే తల, మెదడు అని అర్థం. ఈ అర్థాల ప్రకారం పరిశీలిస్తే.. శరీర అవయవాల్లో తల ఏవిధంగా ఉన్నతమైందో, ఆధ్యాత్మిక సాధనకు మార్గశిరం అంతటి దన్న భావన బోధపడుతుంది. ప్రాణులన్నీ దృఢతరంగా, బలవర్ధకంగా ఎదగడానికీ తగిన పరిస్థితులు ఈ మాసంలో ఉంటాయని ఆయుర్వేదం చెబుతుంది. ఈ కాలంలో పొలాల నుంచి ధాన్యం ఇళ్లకు చేరి ప్రజలు




సంతోషంగా ఉంటారు. నిర్మలమైన ఆకాశం మాదిరిగా ఈ మాసంలో మనసులు నిర్మలంగా ఉంటాయి.
ఈ కాలంలో భగవంతుడికి నివేదించే వంటలలో పసుపు, ఆవాలు, మెంతులు, మిరియాలు చింతపండు మొదలైన వాటిని విరివిగా వినియోగించాలని పెద్దలు చెబుతారు. చలికాలం కావడం వల్ల ఈ పదార్థాల ద్వారా దేహానికి ఉష్ణశక్తి అందుతుందనే శాస్త్రీయ విజ్ఞానం నివేదనల ద్వారా మనకు అందుతుంది. మొత్తంగా హేమంతం ఆసాంతం మనసుకు ఆహ్లాదాన్ని పంచేదే! ఆధ్యాత్మిక శక్తిని పెంపొందింపజేసేదే!!

... డా॥ కప్పగంతు రామకృష్ణ

స్మరణీయం

## అమ్మను ఏమి అడగాలి?

**వివేకానంద** యుక్త వయసులో ఉన్నప్పుడు తండ్రి విశ్వనాథ దత్తా హఠాత్తుగా కన్నుమూశారు. ఒక్కసారిగా ఆ కుటుంబమంతా పేదరికంలో కూరుకుపోయింది. పెద్ద కుమారుడైన వివేకానంద అత్యంత మేధావి, పట్టభద్రుడు. అయినా ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. తల్లీ, చెల్లెళ్లు, తమ్ముళ్లకు ఆయనే ఆధారం. ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లో తన గురువు దగ్గరికి వెళ్లి తన కష్టాన్ని చెప్పుకొన్నారు.



అప్పుడు ఆ పరమహంస సమీపానే ఉన్న దక్షిణేశ్వర కాళీ ఆలయం వైపు చూపిస్తూ 'ఇవాళ మంగళవారం, ఈ రోజున అమ్మవారిని ఏది కోరితే అది అనుగ్రహిస్తుంది. వెళ్లి ఆమెను ప్రార్థించు' అని చెప్పారు. ఆ రోజు సాయంత్రం వివేకానంద కాళీ మందిరానికి వెళ్లి అమ్మను ప్రార్థించారు. అతను ఆలయం నుంచి తిరిగి వచ్చాక రామకృష్ణులు అతనితో 'అమ్మ ఏమంది?' అని అడిగారు. 'అరే! ఆమెను అడగటం మరచిపోయానే' అని వివేకానంద మథనపడ్డారు. 'మరచిపోయావా? మళ్లీ వెళ్లు. త్వరగా వెళ్లు' అని పరమహంస తన శిష్యుడిని మళ్లీ ఆలయానికి పంపారు. అప్పుడూ అదే పరిస్థితి. అలాగే మూడోసారి స్వామీజీ కాళి ఆలయానికి వెళ్లారు. అక్కడినుంచి వచ్చాక వివేకానంద ఎలాంటి అలజడి లేకుండా చాలా ప్రశాంతంగా కనిపించారు. పరమహంసతో 'జగన్మాతను నేను డబ్బు కావాలని ఎలా అడగగలను? అది మహారాజు దగ్గరకు వెళ్లి గుమ్మడికాయ అడిగినట్లు ఉంటుంది! భక్తి, నిస్వార్థ ప్రేమ, ఆమెను అర్థం చేసుకునే శక్తిని ఇవ్వమని అమ్మను ప్రార్థించాను' అన్నారు వివేకానంద. కానీ, అమ్మవారి కృప, గురువుగారి ఆశీస్సుల ఫలితంగా అప్పటినుంచి వివేకానంద కుటుంబానికి అవసరమైన సాధారణ వసతులకు ఎలాంటి లోటూ రాలేదు.

• మనోజ్ఞ

## అపవిత్రః పవిత్రోవా..

అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాం గతోపి వా
యస్మరేత్ పుండరీకాక్షం సబాహ్యాభ్యంతరః శ్శుచిః

నిత్యవిధుల్లో పూజా కార్యక్రమాలన్నీ ఈ శ్లోక పఠనంతోనే ప్రారంభమవుతాయి. ఈ మంత్రం చదువుతూ శరీరంపై, పూజ ద్రవ్యాలపై నీళ్లు చల్లుతారు. భగవంతుడి అనుగ్రహం పొందాలంటే బాహ్య, అంతరంగ శౌచం (శుభ్రత) తప్పనిసరి. దైవనామాన్ని చదువుతూ అంతరంగాన్ని శుభ్రం చేసుకొని పూజ మొదలుపెట్టాలని చెబుతారు పెద్దలు.



మనసు పవిత్రంగా ఉండాలంటే ముందుగా శరీరం శుభ్రంగా ఉండాలి. తర్వాత అంతరంగం పరిశుభ్రంగా ఉండాలి. ఈ విషయాన్ని గుర్తించే సనాతన ధర్మం శుభ్రతకు చాలా ప్రాధాన్యాన్నిచ్చింది. స్నానాది విధులు బాహ్య శౌచాన్ని కలిగిస్తాయి. భౌతికంగా శుభ్రంగా ఉన్నప్పుడే మానసిక ఉన్నతి సాధ్యమవుతుంది. పైకి చూడటానికి శుభ్రంగా కనిపించినా అంతరంగంలో మాత్రం ఎన్నో వాసనలు పేరుకుపోయి ఉంటాయి. అసూయ, ఆందోళన, ఈర్ష్య, ద్వేషం, కోపం ఇలా ఎన్నో అవగుణాలు మనసును ఆవహించి ఉంటాయి. వాటన్నిటినీ తొలగించుకోవడమే అంతర్ శుచి. మనసును స్వచ్ఛంగా, నిర్మలంగా ఉంచటమే మానసిక శౌచం. స్వచ్ఛమైన మనసుతో కాసేపు ధ్యానం చేసినా అనంతమైన ప్రభావం కలుగుతుంది. చిత్తం శుద్ధిగా ఉన్నప్పుడే మలినాలేవీ శరీరానికి అంటకుండా ఉంటాయి.

నలుగురిలో అందంగా కనిపించడానికి శుభ్రత పాటించాలి అనుకుంటాం. లౌకికంగా అది ఆచరించాల్సిన నియమం. అందంగా కనిపించడం కోసమే కాదు ఆత్మశుద్ధికీ శుచి అవసరం. శుభ్రత వల్ల బలం, ఆయుష్షు, ఆరోగ్యం లభిస్తాయని చెబుతున్నది శాస్త్రం. శుభ్రత లేని చోట పరమాత్మ ఉండడు. స్నానం చేసి, పరిశుభ్రమైన వస్త్రాలు ధరించి ధ్యానం ప్రారంభించాలి. ఇది ఆధ్యాత్మిక సాధనలో తొలిమెట్టు. శాస్త్ర గ్రంథాలు కూడా 'శుచిత్వం మాతృరూపేణ' అంటాయి. శుచిత్వం మనకు తల్లివంటిది. తల్లి ఏవిధంగా బిడ్డకు సదా రక్షగా ఉంటుందో, శౌచం కూడా మనల్ని అలాగే రక్షిస్తుందని భావం. వేదమంత్రాలు, ఉపనిషత్తులు సైతం శుచికి తగు ప్రాధాన్యం ఇచ్చాయి. ఇంద్రియ నిగ్రహం కలిగి ఉండటమే శుచిత్వం అంటుంది స్కాందోపనిషత్తు. ఇంద్రియాలపై పట్టు ఉన్నప్పుడు, మనసు పెడదారి పట్టే అవకాశం ఉండదు. అప్పుడు జీవనయానం ధర్మబద్ధంగా కొనసాగుతుంది. ధర్మమార్గంలో మనసు ప్రయాణించడమే ఆంతరంగిక శౌచం అంటుంది భగవద్గీత. 'శుచిత్వమే జ్ఞానం' అని ప్రకటించాడు కృష్ణ పరమాత్మ. శారీరక సౌఖ్యానికి, మానసిక ఉన్నతికి శుచిత్వాన్ని జీవనవిధానంగా మార్చుకోవాలి.

• విష్ణువర్ధన్

## ▪ అసలు ప్రణాళిక

**ఓ** గ్రామీణ యువకుడు బాగా చదివి ఆర్కిటెక్ట్ అయ్యాడు. పట్టణంలో ప్రాక్టీసు ప్రారంభించి చాలా పేరు గడించాడు. ఒకరోజు తీరిక కుదరడంతో సొంత గ్రామానికి వెళ్లాడు. అక్కడ తనకు చిన్నప్పుడు పాఠాలు చెప్పిన తెలుగు పండితుడు కనిపించాడు. ఎలా ఉన్నావని ప్రశ్నించాడు పండితుడు.
'ఆస్తులు, అంతస్తులు, సంఘంలో గౌరవం అన్నీ ఉన్నాయి. కానీ..' అని నీళ్లు నమిలాడు ఆర్కిటెక్ట్. 'సమస్య ఏమిటి?' అని అడిగాడు పండితుడు. 'నేను ఇంటి నిర్మాణానికి ప్లాన్‌లు గీస్తుంటాను. నేను గీసినట్టుగానే ఇల్లు అందంగా పూర్తి అవుతుంది. ఎక్కడా చిన్న తేడా రాదు. కానీ, నా జీవితంలో మాత్రం అనుకున్నవి అనుకున్నట్లుగా జరగడం లేదు! కారణం ఏమిటి?' అని అడిగాడు. పండితుడు నవ్వి 'నువ్వేకాదు. ప్రతి ఒక్కరూ వారికి తోచిన విధంగా తమ జీవితాన్ని ప్రణాళిక చేసుకుంటారు. అలాగే జరగాలని భావించి అహర్నిశలూ అందుకోసం కష్టపడతారు. అది ఎలాంటిదంటే ఎర వెంట పరిగెడుతూ చేప 'దాన్ని వేటాడుతున్నాను' అనుకుంటుంది. ఎర తన వేటకే అని తర్వాత గానీ దానికి తెలియదు.
మనలో చాలామంది తాము అనుకున్న ప్రణాళికలో చిన్నమార్పు జరిగినా తల్లడిల్లిపోతారు. తమ కోరికల చిట్టాను పట్టుకొని ప్రపంచమంతా తిరుగుతారు. ఏవేవో కోరుకొని వాటికోసం వెంపర్లాడుతారు. అనుకున్న ఫలితం రాకపోతే డీలా పడిపోతుంటారు. గీతలో కృష్ణపరమాత్మ చెప్పినట్టు ప్రయత్నం వరకే మనది. ఫలితం ఆశించొద్దు. ఉన్నది ఉన్నట్లు గ్రహించాలి. జరిగేదంతా మన మంచికే అనుకోవాలి. ప్రకృతికి విధేయులమై ఉండాలి. లేకపోతే అశాంతి, నిరాశకు గురవుతాం' అని వివరించాడు పండితుడు. 'నిజమే నా ప్రణాళికల గురించే ఆరాటపడ్డాను. దేవుడి మాస్టర్ ప్లాన్ గురించి మరిచాను' అనుకున్నాడు ఆర్కిటెక్ట్.

... ఆర్.సి.కృష్ణస్వామి రాజు,
93936 62821




కథాసుధ

## తెలియదనేవాడే జ్ఞాని!

యస్యామతం తస్య మతం
మతం యస్య న వేద సః
అవిజ్ఞాతం విజానతాం
విజ్ఞాత మవిజానతామ్ (కేనోపనిషత్తు)

'ఎవడు బ్రహ్మమును తెలుసుకోలేమని ఎరుగునో అతనే తెలుసుకొన్నవాడు. ఎవడు తెలుసుకున్నాను అనుకుంటాడో అతను బ్రహ్మమును ఎరగనివాడు' అని పై శ్లోకానికి అర్థం.
ఒకసారి దేవతలు రాక్షసులను జయించారు. సురలకు గర్వం తలెత్తింది. విజయానికి కారణం పరబ్రహ్మ శక్తి అని మరచిపోయారు. బ్రహ్మ తత్వం గుణపాఠం నేర్పడానికి యక్ష రూపంలో ప్రత్యక్షమైంది. ఆ తత్వాన్ని తెల్సుకోలేకపోయారు దేవతలు. అగ్నిదేవుడితో అదేమిటో చూసి రమ్మన్నారు. అగ్ని వెళ్లగా ఆ భయంకర శక్తి.. 'నీ శక్తి సామర్థ్యా లేమిటి?' అన్నది. 'నేను అన్ని వస్తువులనూ భస్మీపటలం చేసేస్తాను' అన్నాడు అగ్ని. ఆ శక్తి.. ఒక గడ్డిపోచను విసిరి 'దీనిని దగ్ధం చెయ్యి చూద్దాం' అన్నది. అగ్ని ఎంత ప్రయత్నించినా దానిని కాల్చలేకపోయాడు. తర్వాత దేవతలు వాయుదేవుడిని ఆ శక్తి దగ్గరికి పంపారు. వాయువు 'నేను ఎంతటి వస్తువునైనా ఎగురగొట్టగలను' అన్నాడు. 'ఈ గడ్డిపోచను ఎగురగొట్టు, చాలు' అన్నదా శక్తి. బలాన్ని అంతా కూడగట్టుకున్నా వాయువు దాన్ని కొంచెమైనా కదల్చలేకపోయాడు. చివరిగా దేవేంద్రుడు వెళ్లాడు. ఆ తత్వం అదృశ్యమై అందమైన స్త్రీ మూర్తి ప్రత్యక్షమైంది. ఆమే హిమవత్ పుత్రి.. శక్తి. ఆమెతో ఇంద్రుడు 'దేవీ! దేవతలను భయభ్రాంతులను గావించిన యక్ష తత్వం ఏమిటి?' అని ప్రశ్నించాడు.


ఉపనిషత్ వాక్యం

ఉమాదేవి ఇలా ఉపదేశించింది.. 'ఇంద్రా! అదే బ్రహ్మము. దాన్ని మీరు తెలుసుకోలేదు. బ్రహ్మతత్వమే మీలో శక్తిని పూరిస్తున్నది. దానివల్లే మీరు విజయాన్ని సాధించారు. యథార్థమూ, జీవితపరమార్థమూ అదే! అహంకారం ఆత్మజ్ఞానాన్ని హరిస్తుంది సుమా!' అని హెచ్చరించింది. కాబట్టి బ్రహ్మం ఒక దృశ్య పదార్థం కాదని, దాన్ని తెలుసుకోలేమని.. గ్రహించాలి. మేమే గొప్ప అనుకోకూడదని ఈ ఉపనిషత్ కథ బోధిస్తుంది.

... డా॥ వెలుదండ సత్యనారాయణ

## కోపం వస్తే కూర్చోండి!

**అలీబిన్** హుసైన్ (రజి) ఒకసారి తన బానిసకు వేడినీళ్లు తీసుకురావాలని పురమాయించారు. నీళ్లు తెస్తుండగా ఆమె చేయిజారడంతో వేడినీళ్లు అలీ బిన్ హుసైన్ ముఖంపై పడ్డాయి. దీనికి బానిసపై అలీ మండిపడ్డారు. ఆ బానిస వెంటనే ఖురాన్‌లోని 'కోపాన్ని దిగమింగేవారు, ఇతరుల తప్పులను క్షమించేవారు.. ఇలాంటి సజ్జనులంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం' (3:134) అనే వచనాన్ని చదివింది.


ఇస్లాం బోధ

దాంతో అలీబిన్ మనసు తేలికైంది. ఆమెను మన్నించారు. బానిస సంకెళ్ల నుంచి ఆమెకు విముక్తి కల్పించారు. 'కుస్తీ పోటీలో శత్రువును చిత్తుచేసేవాడు కాదు వీరుడు, కోపాన్ని దిగమింగేవాడే నిజమైన వీరుడు' అని ప్రవక్త బోధించారు. కోపం మానవ సహజ నైజమైతే కోపాన్ని దిగమింగడం సజ్జనుల లక్షణం అంటుంది ఖురాన్. ఒకసారి ఒక శిష్యుడు ప్రవక్త (సఅసం) దగ్గరికొచ్చి 'నాకేదైనా హితోపదేశం చేయండి' అని అడిగాడు. దానికి ముహమ్మద్ ప్రవక్త (సఅసం) 'కోపగించుకోకు' అని చెప్పారు. ఇలా ఎన్నిసార్లు అడిగినా ప్రవక్త (సఅసం) అదే హితోపదేశం చేశారు. ఒక మనిషి నైతికతను అంచనా వేయాలంటే అతని కోపావేశాలను చూసి చెప్పవచ్చు. కోపం సైతాన్ లక్షణం. కోపం వచ్చినప్పుడు 'అవూజు బిల్లాహి మినష్షయితాని్రజీం' పఠించుకోవాలని ప్రవక్త సూచించారు. నిల్చుని ఉన్నస్థితిలో కోపం వస్తే కూర్చోవాలి. ఒకవేళ కూర్చుని ఉంటే కాసేపు మేను వాల్చాలి' అని ప్రవక్త తాకీదు చేశారు. కోపం వచ్చినప్పుడు 'వుజూ' చేయాలని, మంచినీళ్లు తాగాలని మరో సందర్భంలో చెప్పారు.

• ముహమ్మద్ ముజాహిద్